
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 1 జూలై 2025

మేమున్నామని.. మీకేం కాదని..

- సామాజిక బాధ్యతగా వైద్య సేవలు
- స్వలాభం కొంత మాని పేదల సేవలో తరిస్తున్న వారెందరో
- గర్భిణులకు ఉపయోగపడుతున్న రక్తహీనత విముక్తి పాఠాలు
- గిరిజన పల్లెలకు గుట్టలు, నీటి వర్రెలు దాటి వైద్య బాటలు
- నేడు వైద్యుల దినోత్సవం

7



నేను ఈ జిల్లా ఆడబిడ్డను..

అభివృద్ధికి కృషి చేస్తా

- మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లున్నా నా బాధ్యత నేను నెరవేరుస్తా..
- ప్రజా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి
- ఐదు పంచాయతీలపై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తా
- లిక్కర్ కేసు విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు
- కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక

ఖమ్మం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'నేను ఈ జిల్లా ఆడబిడ్డను. జిల్లాలో ముగ్గురు మంత్రులు, కార్పొరేషన్ ఛైర్మన్లున్నా నా బాధ్యతగా.. రాజ్యసభ సభ్యురాలిగా జిల్లా అభివృద్ధికి నిరంతరం పనిచేస్తా' అని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పేర్కొన్నారు. ఓ కేసు కోర్టు వాయిదా నిమిత్తం ఖమ్మం వచ్చిన ఆమె కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యసభ సభ్యురాలిగా తాను రాష్ట్రంలో అన్ని చోట్లా పని చేస్తున్నానని, ఖమ్మం ఆడపడుచుగా జిల్లా అభివృద్ధికి మరింత పనిచేస్తానని, ఇకపై జిల్లాలో నిరంతరం (మిగతా 6వ పేజీలో)

వైద్య కళాశాలలో మూడో ఏడాది

ప్రవేశాలకు అనుమతి

ఉత్తర్వులు జారీ చేసిన ఎన్ఎంసీ

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మూడో ఏడాది ప్రవేశాలకు అనుమతులు లభించాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ డైరెక్టర్ సుఖ్‌లాల్ మీనా సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2025-26ఏడాదికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపునకు రాష్ట్రంలోని పలు కాలేజీలను ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కౌన్సిల్) బృందం పరిశీలించింది. బృందం తనిఖీల నేపథ్యంలో 20 విభాగాలకుగాను 19 విభాగాల్లో ఇప్పటికే అధ్యాపకులు, ఎస్సార్‌లు, ట్యూటర్ల కొరత ఉందంటూ ప్రస్తావించారు. అయితే ఈ లోపాలు సరిచేసుకోవాలంటూ ఆదేశిస్తూ ఈ ఏడాదికి ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతులిచ్చారు. ఇటీవల రాష్ట్ర హెల్త్ సెక్రటరీ, డీఎంఈ ఢిల్లీలోని ఎన్ఎంసీ కార్యాలయంలో వివరించారు. ఆ తర్వాత డీఎంఈ ఖమ్మం మెడికల్ కళాశాలను తనిఖీ చేశారు. ఖమ్మం నుంచి ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మూడో ఏడాది విద్యార్థుల బోధనకు ఉన్న వసతులు, నమోదైన ఫలితాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి నివేదికల ఆధారంగా ఎన్ఎంసీ బృందం సంతృప్తి వ్యక్తం చేస్తూ మూడో ఏడాది ప్రవేశాలకు అనుమతిచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

వానాకాలం వచ్చిందంటే గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకుపట్టదు. ఏ క్షణంలో ఎటునుంచి వరద ముంచుకు వస్తుందోనని భయం భయంగా గడుపుతుంటారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలల పాటు గోదావరి, కిన్నెరసాని పరివాహక ప్రాంతవాసులను వరద భయం నిరంతరం వెంటాడుతుంది. ముఖ్యంగా గోదావరి వరదలతో భద్రాచలం ఏజెన్సీలో గిరిజనులు దినదిన గండంగా గడుపుతారు. కొన్నేళ్లుగా జూలైలోనే గోదావరి ఉగ్రరూపం దాల్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జూలైలో గోదావరి వరదలు ఎలా ఉంటాయోనని తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



2022 జూలైలో వచ్చిన గోదావరి వరద నీటిలో బూర్గంపాడు

అమ్మో.. జూలై!

గోదావరి పరివాహక ప్రజల్లో వరద భయం

- గతేడాది ఇదే నెలలో 53.6 అడుగుల గరిష్ఠ ప్రవాహం
- భద్రాద్రి ఏజెన్సీ వాసులకు దినదిన గండమే
- మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తున్న కిన్నెరసాని వాగు
- బూర్గంపాడు మండల ప్రజల్లోనూ భయాందోళన

భద్రాచలం/బూర్గంపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే ప్రాథమిక కసరత్తు పూర్తి చేసింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఒక దఫా కీలక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే వరదలను సమర్థవంతంగా ఏ విధంగా ఎదుర్కోవాలి అనేదానిపై సమీక్షించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

రికార్డు స్థాయిలో వరద ప్రవాహం

2022 జూలైలో రికార్డు స్థాయిలో గోదావరి వరద ప్రవహించింది. ఆ ఏడాది జూలై 16న భద్రాచలం వద్ద 71.3అడుగులు నీటి మట్టం చేరుకోవడంతో జిల్లాలోని పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జిల్లాలోని సుమారు 80గ్రామాలు వరద ముంపునకు గురి కావడంతో 16వేల నివాసాలు ముంపునకు గురయ్యాయి. దీంతో సుమారు 22వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లాలో 16వేల నివాసాలు ముంపునకు గురి కాగా కేవలం బూర్గంపాడు మండల పరిధిలో 7వేలకు పైగా నివాసాలు వరద బారినపడ్డాయి. జిల్లాలో సుమారు 11వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ముంపునకు గురయిన ప్రజలు ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. వరదల అనంతరం బాధితులు తమకు సురక్షిత ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేయాలని కోరుతూ నిరహారదీక్షలు, గోదావరి జలదీక్ష వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టి పలుమార్లు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన సందర్భాలు ఉన్నాయి.

14 సార్లు తొలి ప్రమాద హెచ్చరిక దాటి..

గోదావరి గత ఆరున్నర దశాబ్దాల్లో జూలైలో 14సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటింది. ఇందులో ఆరుసార్లు తుది ప్రమాద హెచ్చరికను (53 అడుగులు) సైతం దాటడం గమనార్హం. 1972 జూలై 6న 44.3 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 29న 54.3, 2003 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 57, 2013 జూలై 24 56.7, 2016 జూలై 12న 52.4 అడుగుల నీటి మట్టం నమోదైంది. 2022 జూలై 16న 71.3 అడుగులు, 2023 జూలై 30న 56.1 అడుగులు, 2024 జూలై 27న 53.6 అడుగులకు చేరుకోగా గత ఏడాది అదే గరిష్ఠంగా నిలిచింది.

మేలు కన్నా.. కీడు చేస్తున్న కిన్నెరసాని

మండల కేంద్రమైన బూర్గంపాడు గ్రామానికి ఆనుకొని ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు మేలు కన్నా.. కీడే ఎక్కువ చేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని జిన్నెగట్టు, ఉప్పుసాక, పినపాకపట్టీనగర్, బుడ్డగూడెం, సోంపల్లి, బూర్గంపాడు గ్రామాలకు సమీపంగా ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు బూర్గంపాడుకు ఉత్తరం వైపున ఉన్న ఏపీ సరిహద్దు ఏలేరు గ్రామ సమీపంలో గోదావరి నదిలో కలుస్తోంది. ఈ క్రమంలో ప్రతి ఏటా గోదావరి వరదల సమయంలో కిన్నెరసాని నుంచి వెళ్లే ప్రవాహనికి అడ్డుగా ఉండడంతో అక్కడ ఎగపోటు ఏర్పడుతోంది. ఈ సమయంలో గోదావరి, కిన్నెరసాని నది పరివాహక ప్రాంతంలో ఉన్న పంట పొలాలు నీట మునిగి వ్యవసాయం చేసే రైతులకు ప్రతి ఏడాది వరదలతో తీవ్ర నష్టం కలుగుతోంది.

భయందోళనలో బూర్గంపాడు ప్రజలు

గోదావరి వరదల అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రాచలంలో పర్యటించి తక్షణ సాయం ప్రకటించారు. అలాగే గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. గత ఏడాది గోదావరి వరదల సమయంలో ముంపు ప్రాంతంలో పర్యటించిన మంత్రులు, అధికారులు చర్యలు తీసుకుంటామని (మిగతా 6వ పేజీలో)

'ఓపి'క పట్టాల్సిందే..

- వైద్యం కోసం ఖమ్మం పెద్దాసుపత్రిలో రోగుల కష్టాలు
- గంటలకొద్దీ క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి

6



జిల్లా జనరల్ ఆస్పత్రిలో సోమవారం ఓపీ నమోదుకు నిల్చున్న జనం

'డెంఫీ'ంకారం

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- వందల సంఖ్యకు చేరుతున్న బాధితులు
- తోగ్గూడెంలో అధికంగా జ్వర పీడితులు
- రోజ రోజుకు పెరుగుతున్న రోగులు

7



మణుగూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు



పాల్వంచలో బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

'చలో పూసుగూడెం' భగ్నం

- 'సీతారామ' నీటి కేటాయింపులపై నిరసనకు బీఆర్ఎస్ యత్నం
- పలువురు నేతలు, మాజీ ఎమ్మెల్యేల ముందస్తు అరెస్టు

ములకలపల్లి/పాల్వంచ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు నీళ్లను భద్రాద్రి జిల్లాకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు చేపట్టిన 'చలో పూసుగూడెం' నిరసన కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన పంపుహౌస్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వానికి పిండ ప్రదానం చేయాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు సోమవారం పూసుగూడేనికి బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పోలీసులు బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేసి నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేశారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు తన అనుచరులతో కలిసి పూసుగూడేనికి బయలుదేరగా మార్గమధ్యంలోనే పోలీసులు వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాధాలు చేశారు. అనంతరం నేతలను ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు నీళ్లు ఇవ్వాలని అడిగితే అక్రమంగా అరెస్టు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే సీతారామ ప్రాజెక్టు పనులను 70శాతం పూర్తి చేశామని, ప్రస్తుతం జిల్లాలో (మిగతా 6వ పేజీలో)



రాజేశ్వరి (ఫైల్)

ఉసురు తీసిన వేధింపులు?

- అవమాన భారంతో ఖమ్మం రైల్వే ఎస్సై భార్య ఆత్మహత్య
- భర్త, అత్తింటి వారు వేధించారని మృతురాలి తండ్రి ఫిర్యాదు
- ఎస్సై, ఆయన తండ్రిని రిమాండ్ చేసిన పోలీసులు
- పోస్టుమార్టం సమయంలో ఖమ్మం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత

7

వెట్టి నుంచి విముక్తే లక్ష్యంగా..

- ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి ఆపరేషన్ ముస్కాన్
- బాల కార్మికులకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వడమే లక్ష్యం
- గత ఐదు విడతల్లో ఖమ్మం జిల్లాలో 3,962 మందికి విముక్తి



ఖమ్మం ఖానాపురంహవేలి / కొత్తగూడెం అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించి.. బాలిక కార్మికత వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతీ ఏటా ఆపరేషన్ ముస్కాన్‌ను నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఆపరేషన్ ముస్కాన్‌ను మంగళవారం నుంచి 31వతేదీ వరకు నిర్వహించేందుకు ఉమ్మడిజిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐసీడీఎస్, కార్మిక శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ, చైల్డ్‌లైన్ తదితర శాఖల సంయుక్తంగా ప్రత్యేక బృందాలను నియమించారు. జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ పేరుతో, జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఎవరైనా బాలబాలికలను పనిలో పెట్టుకుటే 1098 టోల్ ఫ్రీకి సమాచారం అందించాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటి వరకు 11 విడతల్లో ఈ కార్యక్రమం నిర్వహించగా.. గత ఐదేళ్లలో ఈ ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కార్యక్రమాల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో మొత్తం 3,962మందిని గుర్తించారు. వీరిలో 2,969 మంది బాలురు కాగా 993 మంది బాలికలున్నారు. 2021 స్మైల్‌లో 60కేసులు, ముస్కాన్‌లో 66 కేసులు, 2022 స్మైల్ 37, ముస్కాన్‌లో 68, 2023స్మైల్‌లో 30, ముస్కాన్‌లో 38, 2024 స్మైల్‌లో 46, ముస్కాన్‌లో 49, 2025 స్మైల్‌లో 51 కేసులు నమోదు చేశారు. వీరిలో కొందరిని తల్లితండ్రులకు అప్పగించగా మిగిలిన వాళ్లలో కొందరిని ఇతర జిల్లాలు, రాష్ట్రాల పిల్లలను వారి వారి ప్రాంతాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. బడికి దూరమైన, బందీగా మారుతున్న బాల్యానికి విముక్తి కల్పించి స్వేచ్ఛాయుత (మిగతా 6వ పేజీలో)

వర్షం.. పంటలకు ప్రాణం

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వాన
- ఖమ్మం జిల్లాలో సగటున 31.6మి.మీ
- భద్రాద్రి జిల్లాలో జూన్‌లో 169.1 మి.మీ. సగటు వర్షపాతం

6

పగబట్టిన విధి

- కూతురి వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చలేక తండ్రి బలవన్మరణం

7



పరశురాం (ఫైల్)

మునగ, వెదురు సాగుపై
దృష్టి సారించాలి

- పోడు రైతులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచన
- ఇల్లెందు మండలంలో పర్యటన


కొమరారం రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

ఇల్లెందురూరల్/ఇల్లెందు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పోడు భూమి పట్టాలు కలిగిన గిరిజన రైతులు మునగ, వెదురు సాగుపై దృష్టిసారించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఇల్లెందు మండలం కొమరారం, 21 పిట్, సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీలో పర్యటించి పలు సమస్యలను ప్రజల వద్ద నుంచి స్వీకరించారు. కొమరారం పోడు రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలవైపు రైతులు మొగ్గుచూపాలని గిరిజన రైతులకు వివరించారు. మునగ, వెదురు సాగులపై ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. రైతులంతా ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం కొమరారం గిరిజన రైతుల నుంచి పలు వినతులను స్వీకరించారు. కొమరారం కేంద్రంగా మార్కెట్ యార్డుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌తోపాటు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధన్‌సింగ్, తహసీల్దార్ రవికుమార్, ఏవో సతీష్, ఏపీఎం దుర్గారావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వసతులు

ప్రభుత్వ వైద్యశాలలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్టు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు. వైద్యశాలలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల వైద్యులు అదనపు షెడ్లు, ఇతర సౌకర్యాలను మెరుగుపర్చాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలు, ఏరియా వైద్యశాలలో సీజనల్ వ్యాధులకు అనుగుణంగా తగిన మందులను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించామని వివరించారు. ఏరియా వైద్యశాలలతోపాటు పీహెచ్‌సీ వైద్యశాలలను కూడా పటిష్ఠంగా తయారు చేసినట్టు వెల్లడించారు. అంతకుముందు ఇల్లెందు పట్టణంలోని చెరువుకట్ట ఏరియాలో గల ఫెర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విధానపరిషత్ అధికారి డాక్టర్ రవిబాబు, ఇల్లెందు ఏరియా వైద్యశాల వైద్యులు హర్షవర్ధన్, రాంనివాస్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో ధన్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి జిల్లా అధికారులే హాజరవ్వాలి

- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్


వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల జిల్లా అధికారులే హాజరవ్వాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిని జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో మానవీయకోణంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి వారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులు ఆయా శాఖ పరిధిలో సమీక్షించుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ 5 శాతం ప్రజావాణి దరఖాస్తులను క్రాస్ చెక్ చేస్తారని అన్నారు. ప్రతి జిల్లా అధికారి తన పరిధిలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించి వివరాలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే సీఎస్ వీడియో సమావేశాలకు అవసరమైన నోట్స్ సిద్ధం చేసి, ముందస్తుగా సమర్పించాలన్నారు. ఈ ప్రజావాణిలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీఓ ఎన్.సన్యాసయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదులు ఇలా...

● ఖమ్మం నగరంలో వివిధ వాహనాల మెకానిక్‌లు కొన్ని దశాబ్దాలుగా పనిచేసుకుంటూ జీవిస్తున్నామని ప్రస్తుతం మున్నేరు పరివాహక ప్రాంతం లో పనులు చేసుకుంటున్నామని, గతేడాది వరదల కారణంగా షాపులు మునిగిపోయి తీవ్రంగా నష్టపోయామని కలెక్టర్ అనుదీప్‌కు ఖమ్మం నగర ఫోర్‌వీలర్స్ ఆటో టెక్నీషియన్స్ మెకానిక్‌లు ఫిర్యాదుచేశారు. 600మంది ఉన్న మెకానిక్‌లు ఈ ఏడాది కూడా వరదలు వచ్చే ఆస్కారం ఉన్న నేపథ్యంలో ఆందోళన చెందుతున్నామని మాకు శాశ్వతంగా స్థలాన్ని కేటాయించాలని సంఘం నాయకులు మల్లిఖార్జున్, రవి తదితరులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

● నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామ రైతులు శివారు సర్వే నెంబర్ 378, 379 వైపుగా వెళ్లే బండ్ల బాటను కలుపుకొని కంప ఏర్పాటు చేసుకొని కొంతమంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, దీంతో తమ భూములకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని, బండ్లబాట హద్దులు పునరుద్ధరించాలని పలువురు రైతులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

● వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామ ప్రజలు తమ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులను ఎంపిక చేశారని, వారిని తొలగించి అర్హులను ఎంపిక చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


ఆర్అండ్‌బీ ఈఈగా బాధ్యతలు చేపట్టిన పవార్

ఆర్అండ్‌బీ ఈఈగా బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం పవార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ యుగందర్ ఈఈగా విధులు నిర్వహించారు. ఆయన నేషనల్ హైవేస్‌లో పనిచేస్తుండగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయన స్థానంలో ఎం పవార్‌ను నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఈఈని డీఈలు ఎం.రమేష్, వి.భగవాన్, బి.చంద్రశేఖర్, వివిధ మండలాల జేఈలు కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

విద్యారంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యారంగ పరిరక్షణకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ కె.లింగయ్య అన్నారు. సోమవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, ఎన్ఎస్పీ పాఠశాల ఉపాధ్యాయుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ నగరంలోని ఎన్ఎస్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగాభివృద్ధికి వైవీ ఎనలేని కృషి చేశారని, ఉపాధ్యాయులు అందరూ వైవీని ఆదర్శంగా తీసుకొని పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సమాజ సేవలు ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పీఆర్టీయూ నూతన భవనంలో ఏర్పాటుచేసిన ఏసీ సమావేశ మందిరాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదరరెడ్డిలు చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు మోతుకూరు మధు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి దుర్మరణం



మృతులు రఘుపతి, రాజేష్(ఫైల్)

ఏన్కూరు, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం హిమాంనగర్ గ్రామసమీపంలో సోమవారం ఉదయం జరివగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. ద్విచక్రవాహనాన్ని టాటా ఏసీ వాహనం ఎదురుగా ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన హోంగార్డు ఇమ్మడి రఘుపతి(50), దమ్మపేట మండలం అంకంపాలేనికి చెంది బత్తుల రాజేష్(30) మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం మృతుడు రాజేష్ ఖమ్మంలో నివాసం ఉంటూ ఉద్యోగరీత్యా కొత్తగూడేనికి రోజు బస్సు ప్రయాణంచేస్తున్నాడు. సోమవారం ఖమ్మం నుంచి తన ద్విచక్రవాహనంపై బయలుదేరగా మార్గమధ్యలో పల్లిపాడు గ్రామంలో హోంగార్డు రఘుపతి లిఫ్టు అడిగి రాజేష్ ద్విచక్రవాహనం ఎక్కాడు. ఇరువురు కొత్తగూడెం వెళుతున్న క్రమంలో చంద్రుగొండ మండలం వెంగన్నపాలెం నుంచి కేసుపల్లికి బయలుదేరిన టాటా ఏస్ వాహనం హిమాంనగర్ వద్దకు రాగానే ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇరువరికి తీవ్రగాయాలు అయ్యాయి. వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడు రాజేష్‌కు భార్య గౌరి, రెండేళ్ల బాబు ఉన్నాడు. రఘుపతికి ఇద్దరు కుమార్తెలు శ్రీ, త్రివేణి, భార్య లక్ష్మి ఉన్నారు.

నేటి నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

- ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య ఉచితం
- ఎంసెట్‌లో పదివేలపైన ర్యాంకు వచ్చినా..
- బీసీ, ఓసీ విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే చెల్లించనుంది

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఇంజనీరింగ్‌లో ఉచిత విద్యను అందించనున్నది. ఎంసెట్‌లో పదివేలకంటే ఎక్కువ ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నది. మూడేళ్ల క్రితం వరకు ఓసీ, బీసీ విద్యార్థులకు ఎంసెట్‌లో పదివేలలోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండేది. గత మూడేళ్ల నుంచి ప్రభుత్వ కాలేజీల్లో చదివిన విద్యార్థులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది. ప్రభుత్వ నిర్ణయంతో ఎంసెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. టాప్‌టెన్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు వచ్చినా ప్రభుత్వ విద్యార్థులకు ఈ అవకాశం ఉంటుంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ 28 నుంచి జూలై 8 వరకు స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 6 నుంచి 10 వరకు ఆప్షన్స్ ఫ్రీజింగ్, 18న సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో విడత జూలై 25న, మూడో విడత ఆగస్టు 5న ప్రారంభం కానున్నది. మొదటి దశ కౌన్సెలింగ్ నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రారంభకానున్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో భాగంగా ఎంసెట్‌లో 10వేలలోపు ర్యాంకు వచ్చినవారికి ఏ కాలేజీలో సీటు వచ్చినా పూర్తి ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఏ కులం వారికైనా ఇది వర్తిస్తుంది. పదివేల పైన ర్యాంకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు తమ కుటుంబ ఆదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికంటే తక్కువే ఉన్నదని ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే పూర్తి ఫీజును ప్రభుత్వం చెల్లిస్తుంది. పదివేలపైన ర్యాంకు వచ్చిన బీసీ విద్యార్థులకు రూ.35వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా చెల్లిస్తుండగా, మిగతా ఫీజును విద్యార్థులే భరించాలి. తాజా నిర్ణయం ప్రకారం సర్కారు కాలేజీల్లో చదివిన ఏ కులం విద్యార్థులకైనా ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. అయితే వీరు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. కుటుంబ వార్షికాదాయం ప్రభుత్వం నిర్ణయించిన స్థాయికి మించి ఉంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఎంసెట్ కౌన్సిలింగ్‌లో ప్రభుత్వం బీసీ, ఓసీ విద్యార్థులకు సరికొత్త పథకాన్ని అమలు చేస్తుండటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు అవసరమైన సర్టిఫికెట్లు

కౌన్సెలింగ్‌కు హాజరుకానున్న విద్యార్థులు తప్పనిసరిగా 2025 ఎప్‌సెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, 10వ తరగతి మార్కుల మెమో, ఇంటర్మీడియట్ షార్టు, లాంగ్ మెమో, 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ, కుల, ఆదాయం సర్టిఫికెట్లు (2025 జనవరి 1 నుంచి తీసుకున్నది), ఇంటర్ టీసీ, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, అదనంగా రిజర్వేషన్లు ఉన్న విద్యార్థులు మైనారిటీ సర్టిఫికెట్, దివ్యాంగుల, ఈడబ్ల్యూఎస్, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఉన్నవారు తీసుకెళ్లాల్సి ఉంటుంది. దీనితోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన అన్ని వర్గాల విద్యార్థులు ముందుగా కౌన్సెలింగ్ అధికారిని కలిసి వివరాలు చెప్పాల్సి ఉంటుంది.

విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు

వెబ్ ఆప్షన్లు పెట్టుకునే సమయంలో వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవాలి. విద్యార్థి ర్యాంకులకు సంబంధించి గతేడాది ఏఏ కళాశాలల్లో సీట్లు వచ్చాయో, ముందుగా తెలుసుకుని ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ఆప్షన్లు పెట్టుకునే సమయంలో ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్లు మాత్రమే వాడాలి, ఆప్షన్లను మీసొంత ఆలోచన ప్రకారం పెట్టాలి. సీట్ అలాట్‌మెంట్ జరిగిన తర్వాత ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలి. దీనికి విద్యార్థి సొంత బ్యాంకు అకౌంట్ నుంచి లేదా తల్లిదండ్రుల అకౌంట్ నుంచి మాత్రమే చెల్లించాలి.

నేను ఈ జిల్లా ఆడబిడ్డను..
అభివృద్ధికి కృషి చేస్తా

(5వ పేజీ తరువాయి)

పర్యటనలు సాగిస్తానని స్పష్టంచేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు పిచ్చి ఆరోపణలు చేస్తున్నారని, పిండప్రదానం చేస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్, కేటీఆర్, వారి ప్రభుత్వానికి గత ఎన్నికల్లోనే పిండప్రదానం చేశారని, అయిన వారి తీరు మారలేదని ఎద్దేవా చేశారు. ప్రజామోదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఏడాదిన్నర పాలనలో తమ ప్రజాప్రభుత్వం రైతులకు రూ2లక్షల రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, ఆరుగ్యారంటీల అమలు, రైతు భరోసా లాంటి పథకాలే కాకుండా విదేశీపెట్టుబడుల ఆకర్షణకు అనేక కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అలా రాష్ట్రంలో బంగారు పాలన సాగిస్తుంటే ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఫోన్‌ట్యాపింగ్‌లకు పాల్పడి ఎంతో మందిని ఇబ్బందులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు మీడియాలో వాస్తవాలు చెబుతుంటే దాడులకు దిగుతారా అని ప్రశ్నించారు. మంచి చేసిన వారైతే బీఆర్ఎస్ నాయకులు పోలీసుల సహకారంతో ప్రజల్లో ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. లిక్కర్ కేసు నుంచి కవితను కాపాడుకునేందుకు బీజేపీతో బీఆర్ఎస్ రాజీపడిందని, రెండు పార్టీలు కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు వారిని నమ్మడంలేదన్నారు. లిక్కర్ కేసులో డబ్బులు ఏమయ్యాయో ఇప్పటి వరకు కేంద్ర సంస్థలు ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోదీ ఇప్పటి వరకు అసలు నిందితులను ఎందుకు పట్టుకోలేదో చెప్పాలని, పహల్గాం దాడులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు పెట్టాలని కోరినా ప్రధాని పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సారి పార్లమెంట్‌సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులతోపాటు విభజన చట్ట హామీలు కేంద్రం తెలంగాణ అభివృద్ధికి నిధుల కేటాయింపులో చూపుతున్న వివక్షతపై ప్రశ్నిస్తామన్నారు. అలాగే భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణకు ఇవ్వాలని నిలదీస్తామన్నారు.

రాములవారి భూములు కూడా ఏపీలోకి వెళ్లాయని, భద్రాచలం పుణ్యక్షేత్ర అభివృద్ధి దెబ్బతింటోందని, ఈ పంచాయతీలను తెలంగాణలో కలపాలని మొదటినుంచి కేంద్రానికి చెబుతూనే ఉన్నామని, దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో నిలదీస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామన్న హామీ గురించి విలేకరులు ప్రశ్నించగా.. ఖమ్మంజర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చే విషయంలో ఎంపీగా నావంతు కృషిచేస్తానన్నారు. అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడతానని, గతంలో ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు, పృథ్వీచౌదరి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నాయకులు వెంకటరత్నం, మిక్కిలినేని నరేంద్ర, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

వెట్టి నుంచి విముక్తే లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మహిళా, శిశు సంక్షేమ, పోలీసులు, కార్మిక, శిశు సంరక్షణ శాఖలకు చెందిన అధికారులతో కూడిన కమిటీల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ ముస్కాన్ కింద జూలై మాసంలో బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. బాలబాలికలకు విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు ఇతర రాష్ట్రాల బాలురను వారి ప్రాంతాలకు పంపిస్తారు. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు ఐదు డివిజన్లలో పోలీస్ శాఖ నుంచి ఐదుగురు, 1 చైల్డ్ హెల్ప్‌లైన్, 1 డీసీపీయూ, ఒక చైల్డ్ లేబర్ కార్యాలయం నుంచి ఒక్కొక్కరు చొప్పున కేటాయించారు. జిల్లాలో మణుగూరులో బాలికలకు, కొత్తగూడెంలో యుడీఆర్ఎస్ సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు, జరిమానాలు

రాంగోపాల్‌రెడ్డి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

బాలలను ఎక్కడా కూడా పనిలో పెట్టుకోవద్దు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నాం. పిల్లలను పనిలో పెట్టుకుంటే సంబంధిత వ్యక్తులపై జువైనల్ జస్టిస్ యాక్ట్ 2015 సెక్షన్ 57ప్రకారం కేసులు నమోదు చేస్తాం. రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానాలుంటాయి. ముస్కాన్ తనిఖీల్లో గుర్తించిన వారిని పాఠశాల్లో చేర్పించడంతో పాటు వారి తల్లిదండ్రుకు అప్పగిస్తాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలకు తప్పనిసరిగా పంపించాలి. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం, బాల్య వివాహం చేస్తే తల్లిదండ్రులపైనే కాకుండా ఇందుకు ప్రోత్సహించిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం.

వర్షం.. పంటలకు ప్రాణం

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వాన

ఖమ్మం, జూన్ 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : రోహిణిలోనే పడిన వర్షాలు.. ఆ తర్వాత మొహం చాటేయడం.. కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులు రావడంతో రైతులు వానాకాలం సాగుపై సందిగ్ధంలో పడ్డారు. ముందుగానే వేసిన పత్తివిత్తనాలు మొలకెత్తక ఆందోళన చెందారు. కానీ ఆదివారం రాత్రినుంచి ఉదయం వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుచోట్ల భారీగా, కొన్నిచోట్ల మోస్తరు వర్షం పడటంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. ఎత్తి చేలతోపాటు వరినారుమళ్లు, మొక్కజొన్న, కంది, పెసర తదితర పంటలకు ప్రాణం పోసినట్టయివంది. వర్షాలతో పత్తి చేలకు రైతులు ఎరువులు వేస్తున్నారు. ప్రస్తుతం కురిసినవర్షాలతో మరో వారంరోజుల వరకు పెరుగుతున్న పంటలకు నీటి సమస్య తప్పగా వేసే పంటలకు సైతం అదును, పదును లభించింది. ప్రస్తుతం కురిసిన వర్షాలతో జిల్లాలో వానాకాలం సాగు ముమ్మరం కానుంది. ఖమ్మం జిల్లాలో సగటున 31.6మి.మీ వర్షపాతం నమోదవగా.. అత్యధికంగా సత్తుపల్లిలో 43.6మి.మీ., తిరుమలాయపాలెం 41.6మి.మీ., రఘునాథపాలెంలో 41.8మి.మీ., కామేపల్లిలో 38.4మి.మీ., కల్లూరులో 42.0మి.మీ. వర్షం పడింది. జిల్లాలో అన్ని మండలాల్లోనూ 20మి.మీ. నుంచి 40మి.మీ.వరకు వర్షం పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జూన్‌లో 169.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవాల్సి ఉండగా.. 134.3 మిల్లీమీటర్ల వాన పడింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు 21.3 మిమీ సగటు వర్షపాతం నమోదవగా జూలూరుపాడులో 58.8, చంద్రుగొండలో 44.6, అశ్వారావుపేటలో 35.6మి.మీ వర్షం పడింది. అన్ని మండలాల్లోనూ ముసురు పట్టింది.

గంజాయి నియంత్రణకు
కట్టుదిట్టమైన చర్యలు

- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం, జూన్30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని సమూలంగా నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీపీ సునీల్‌దత్ అన్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారులతో ఆయన నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. యువత డ్రగ్స్‌కు ఆకర్షితులైతే దేశ భవిష్యత్తు నాశనం అవుతుందనీ, డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాలపై అవగాహన కల్పిస్తూనే మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా మరింత పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని వైరా, కల్లూరు డివిజన్ పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో బారికేడ్లు, సూచిక బోర్డులు, సిగ్నల్ లైట్లు, బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారణాలుగా ఉంటున్నాయనీ నివేదికలు చెబుతున్న క్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పెద్ద వాహనాలు, ట్రాక్టర్లు, టిప్పర్లు, ఇతర వాహనాలకు వెనుక వైపు రేడియం స్టిక్కర్‌లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని చిట్టీల పేరుతో పలువురు చిట్ వ్యాపారులు బాధితులను మోసం చేస్తున్నారనీ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిపై దృష్టిపెట్టాలన్నారు. సేఫ్టీ అండ్ సెక్యూరిటీ దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తూ సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగంగా స్వచ్ఛందంగా ప్రజల భాగస్వామ్యం కావాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డీసీపీ ఏఆర్ కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రఘు, రవి, సర్వర్, సుశీల్ సింగ్, నర్సయ్య పాల్గొన్నారు.

'చలో పూసుగూడెం' భగ్నం

(5వ పేజీ తరువాయి)

ముగ్గురు మంత్రులున్నా వారు చేసింది శూన్యమన్నారు. పనులు చేయడం చేతకాకపోతే రాజీనామా చేయాలని మెచ్చా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వగ్గెల పూజ, సున్నం లలిత, మోరంపూడి అప్పారావు, శనగపాటి సీతారాములు, పుష్పాల చందర్‌రావు, పుష్పాల సాయి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పాల్వంచ నుంచి నిరసన కార్యక్రమానికి బయలుదేరగా పాల్వంచ సర్కిల్ పోలీసులు పాల్వంచ పట్టణ పరిధిలోని కుంటినాగులగూడెం వద్ద అడుకున్నారు. పాత పాల్వంచ నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు బారీకేడ్లను నెట్టివేయడానికి ప్రయత్నించగా కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పోలీసులు బీఆర్ఎస్ ముఖ్య నాయకులను అదుపులోకి తీసుకొని పాల్వంచ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీస్ రాజ్యాంగం నడుస్తోందన్నారు.

కొత్తగూడెం జిల్లా నుంచి పారుతున్న నీళ్లను స్థానిక రైతులకు ఇవ్వకుండా జిల్లాకు చెందిన మంత్రులు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడితే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి బెదిరేది లేదన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేష్‌రెడ్డి, వనమా రాఘవేంద్రరావు, సింధుతపస్వి, మంతపురి రాజుగౌడ్, తెలంగాణ సురేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మో జూలై !

(5వ పేజీ తరువాయి)

తెలిపినా పనులు చేపట్టలేదు. జూలైలో గోదావరి వరదలు రానున్న తరుణంలో మరోసారి తమ అవాసాలు ముంపునకు గురవుతాయని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాల్లోని అద్దె ఇళ్లకు తరలిపోతున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బూర్గంపాడు మండలం ముంపునకు గురి కాకుండా కరకట్ట నిర్మాణాలను చేపట్టి తమను ఆదుకోవాలని వరద బాధితులు వేడుకుంటున్నారు.

సమాచారం వేగవంతంగా ఇవ్వాలి


అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన సమాచారం సేకరించేందుకు వాట్సప్ గ్రూపును జిల్లా అధికార యంత్రాంగం గతంలో ఏర్పాటు చేసింది. అయితే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు సమాచారం వేగవంతంగా తెలుసుకునేందుకు ఈ వాట్సప్ గ్రూపు నిర్వహణపై అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టిసారించాలి. అలాగే భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయం, కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

'ఓపి'క పట్టాల్సిందే..

- వైద్యం కోసం ఖమ్మం పెద్దాసుపత్రిలో రోగుల కష్టాలు
- గంటలకొద్ది క్యూలో నిలుచోవాల్సిన పరిస్థితి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతున్నాయి.. సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ఖమ్మం జిల్లా జనరల్ ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం 1200 ఔట్‌పేషెంట్లు (ఓపీ) నమోదయ్యినట్టు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వారు వివరాల నమోదు నుంచి వైద్యుడి వద్దకు వెళ్లేవరకు గంటలకొద్ది క్యూలైన్లలో 'ఓపి'కగా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల నమోదు కేంద్రంలో వేర్వేరుగా రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వివరాలు నమోదు చేసిన తర్వాత వచ్చే సెంట్రలైజ్డ్ రిజిస్ట్రేషన్ (సీఆర్) నెంబర్‌ను ప్రింట్ తీసి రోగికి ఇచ్చేందుకు అధిక సమయం పడుతోంది. అటో ఇటో ఆ ప్రక్రియను పూర్తిచేసుకుని వైద్యుడిగది వద్దకు వెళ్లే క్రమంలోనూ రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రోగుల రద్దీకి తగినట్టుగా అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు సూచించినా.. ఆ దిశగా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, దీంతో రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు.


జిల్లా ఆస్పత్రిలో రోగుల రద్దీ



మేమున్నామని.. మీకేం కాదని..

వైద్యులు దేవుళ్లతో సమానం. వైద్య సేవలు ఎంతో గొప్పవి. అమ్మ మనకి జన్మనిస్తే.. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు, రిస్క్‌తో కూడిన శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చినప్పుడు వైద్యులు పునర్జన్మను ప్రసాదిస్తారు. అందుకే వైద్యో నారాయణో హరి అని మన పెద్దలు అన్నారు. అలాంటి వైద్యులను గుర్తు చేస్తూ దివంగత పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి, ప్రఖ్యాత వైద్యుడు, విద్యావేత్త, భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ వైద్య రంగానికి చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని, వర్ధంతిని పురస్కరించుకుని భారతదేశంలో 1991 నుంచి జూలై 1వ తేదీని డాక్టర్స్‌డేగా జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా పరిధిలోని సామాజిక బాధ్యతగా వైద్య సేవలందిస్తున్న పలువురు వైద్యుల గురించి ప్రత్యేక కథనం..

- ఖమ్మం కలెక్టరేట్/ అశ్వారావుపేట/ ఆళ్లపల్లి

- నాడి పట్టి చికిత్స చేస్తున్న డాక్టర్లు
- కొవిడ్‌లో బాధితులకు లాభించిన సలహాలు
- గర్భిణులకు ఉపయోగపడుతున్న రక్తహీనత విముక్తి పాఠాలు
- గుండె లయ తప్పకుండా సత్వర స్పందనలు
- గిరిజన పల్లెలకు గుట్టలు, నీటి వర్రెలు దాటి వైద్య బాటలు

సామాజిక బాధ్యతగా వైద్య సేవలు

నేడు వైద్యుల దినోత్సవం



జల్లేరువాగు దాటుతున్న పీహెచ్‌సీ వైద్యులు

రోగుల ప్రాణాలను కాపాడటానికి, సీజన్‌లో వ్యాధుల నుంచి రక్షించటానికి వైద్యులు నిత్యం శ్రమించాల్సి వస్తుంది. అశ్వారావుపేట మండలం, మారుమూల గ్రామమైన పెద్దమిద్ది గ్రామంలో నివసిస్తున్న గొత్తికోయలు నివసించే పెద్దమిద్ది గ్రామస్థులకు వైద్య సేవలు అందించడం పెద్ద ప్రయాసే. అశ్వారావుపేట మండల కేంద్రానికి 50 కి.మీ దూరంలో వున్న అతి మారుమూల గ్రామమైన మొద్దులమాడ గ్రామం నుంచి ఆరు కిలో మీటర్లు లోపల గుట్టల మధ్యన దాదాపు 30 కుటుంబాలకు పైగా గొత్తికోయలు జీవిస్తున్నారు. అటవీ ప్రాంతం మధ్యలో వీరు నివాసముంటున్నారు. వర్షాకాలం జ్వరాలు వస్తే వీరి పరిస్థితి ఆగమ్యగోచరం. వర్షాకాలంలో ఇక్కడ గిరిజనులకు అధికంగా మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వస్తుంటాయి. ఈ గ్రామానికి వెళ్లాలంటూ మూడు వాగులు దాటి కొండలను దాటుకొని నడచి వెళ్లాల్సి వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ వాగులన్నీ నీరు పారుతూ ఉంటాయి. జ్వరాలు వచ్చిన వారికి వైద్యం చేయాలన్న, రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు చేయాలన్న వినాయకపురం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రామదాస్ వారి సిబ్బంది వాగులు దాటుకొని కాలినడకన పెద్దమిద్ది చేరుకోవాలసి వస్తుంది. ఈ గ్రామానికి వెళ్లి గ్రామస్థులకు వైద్యసేవలు అందించి రావాలంటే కొద్దిదూరం వాహనం, ఆరు కిలోమీటర్లు వాగులు దాటి కాలినడక తప్పనిసరి.

ఉప్పొంగే ఏర్లు దాటి..

ఆళ్లపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో అనేక గిరిజన గ్రామాలకు రహదారులు, లేవు, వర్షాకాలం వస్తే పొంగుతున్నవాగులు దాటలేక గిరిజనులకు వైద్యం అందని పరిస్థితి, దాంతో కొందరు మంచాలనికే పరిమితమవ్వగా, మరికొందరికి సరైన వైద్యం అందక మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు పునారావృతం కావద్దని పీహెచ్‌సీ వైద్యులు సీజనల్ వ్యాధుల నుంచి గిరిజనులను రక్షించాలనే దృఢ సంకల్పంతో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సంఘమిత్ర, డాక్టర్ రేవంత్ తమ వైద్య సిబ్బందితో కలిసి వర్షకాలం గిరిజన గ్రామాలకు వైద్యబాటలు వేశారు. మండలంలో సరైన రహదారులు లేని, కిన్నెరసాని, జల్లేరు, పాలవార్రె, అలుగువార్రె వాగులు అడ్డుగా ఉన్న అడవిరామవరం, పాతూరు, కర్నేగూడెం, చంద్రాపురం, బాసోళ్లగుంపు, వెంకటాపురం, సింగారం, రాయిగూడెం, బూసురాయి గ్రామాలతో పాటు పలు గ్రామాలకు రహదారులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. దాంతో రోగులకు వైద్య సేవల్లో ఇబ్బందులు రావద్దని, ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యులే గ్రామాల బాటపట్టారు. గ్రామాలకు వెళ్లి, ఇంట్లో, గ్రామంలో పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తు, జ్వరాల తీవ్రత, ఆరోగ్య పరిస్థితులు, గర్భినుల వివరాలు సేకరిస్తు వైద్యం అందిస్తున్నారు. రహదారులు లేని, వాగులు అడ్డుగా ఉన్న గ్రామాల్లోని గర్భిణులకు ముందస్తుగా వైద్య సాయం కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.



పెద్దమిద్ది గొత్తికోయల గూడేనికి వాగు దాటి వెళుతున్న వైద్యులు, సిబ్బంది

పల్లెరోగులకు ఇబ్బందులు రానివ్వం

డాక్టర్ సంఘమిత్ర, ఆళ్లపల్లి పీహెచ్‌సీ

గ్రామాల్లో నిరుపేద ప్రజలు ప్రైవేట్ వైద్యం పొందే స్థోమత లేక, వాగులు, వార్రెలు దాటి ప్రభుత్వ వైద్యశాలకు రాకపోవడంతో వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి ఇబ్బందులు రానివ్వద్దని, గిరిజన గ్రామాల ఇంటివద్దకే వైద్య సేవలు అందించాలని పల్లెలోకి వెళ్లి గ్రామాల పరిశుభ్రత, ఇంట్లో పరిసరాల పరిశుభ్రత, ఆహారపు అలవాట్లును తెలుకుని వైద్యం అందిస్తూ ఆరోగ్య సమాజంగా చేస్తున్నాం.



డాక్టర్ కృపా ఉషశ్రీ, సీనియర్ గైనకాలజిస్ట్

గర్భిణులకు అండగా...

తిరుమలాయపాలెం వైద్యాధికారి డాక్టర్ కృపాఉషశ్రీ. గర్భిణుల పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమె గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో పదేళ్లపాటు పనిచేశారు. రక్తహీనత ఉన్న వారికి మందులు ఇస్తూ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఆమె ఆధ్వర్యంలో 10వేలకు పైగా ప్రసవాలు చేశారు. సిబ్బంది సహకారంతో ఎన్నోకుటుంబాల్లో ఆమె వెలుగులు ప్రసాదించారు. కరోనా లాంటి క్లిష్టపరిస్థితుల్లోనూ గర్భిణిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి వారిలో భయాందోళనలు పోగొట్టారు. హోం ఐసోలేషన్లో ఉండేందుకు ఆమె ఇచ్చిన సలహాలు, సూచనలు వారికి ఉపయోగపడ్డాయి. ఎంతో మంది జూనియర్ డాక్టర్లకు వైద్యసలహాలు ఇవ్వడంలో తనదైన పాత్ర పోషించారు.



డాక్టర్ పి. గోర్కి, సీనియర్ వైద్యుడు

రోగి కండీషన్‌కే ప్రాధాన్యం..

డాక్టర్ గోర్కి 1973లో ఖమ్మంలో ప్రాక్టీస్ ప్రారంభించారు. అప్పుడు ఖమ్మంలో చాలా తక్కువ నుంది. వైద్యులు ఉండేవారు. నీతి నియమాలు, నిబద్ధతతో వైద్యం చేసేవారు. ఎవరైనా రోగికి అత్యవసరంగా హాస్పిటల్‌కు వచ్చిన సందర్భంలో పట్టణంలో ఉన్న డాక్టర్లంతా ఒకరికొకరం మాట్లాడుకునే వారు. రోగి పరిస్థితిని బట్టి, వైద్యం చేసే విధానంపై సమగ్రంగా చర్చించే వాళ్లు. వైద్యులుగా ఆనాడు రోగి కండీషన్‌కే ప్రాధాన్యం ఇచ్చేవారు. పెద్దగా డబ్బు సైతం ఆశించేవారం కాదు. ఆరోజుల్లో రవాణా సౌకర్యం సైతం పెద్దగా లేదు. డాక్టర్లకు మంచి గౌరవ మర్యాదలుండేవి. రోడ్డుపై నడిచి ఆస్పత్రికి వస్తుంటే ఆర్టీసి బస్సు సైత ఆపి మమ్మల్ని ఆస్పత్రి వద్ద దింపేవారు. రోగి కండిషన్ బాగాలేక అసుపత్రిలో రోగి మరణించినా ఒక్కరు కూడా డాక్టరు నిందించేవారు కాదు. నేటిలా వైద్యపరీక్షలు ఆనాడు అవసరం ఉండేవికాదు.



డాక్టర్ సీతారాంనాయక్, గుండె వైద్య నిపుణుడు

ఎన్నో గుండెలకు ప్రాణం పోసి..

కొవిడ్ తర్వాత గుండెకు సంబందించిన వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. ఈ తరుణంలో వయస్సుతో నిమిత్తం లేకుండా గుండెపోటు, స్టంట్ల అవసరం, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టుక పోవడం లాంటివి ఎక్కువయ్యాయి. ఈ తరుణంలో హృద్రోగులకు గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సీతారాం మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్ అందుబాటులోకి వచ్చిరెండున్నరేళ్ల కాలంలో ఇప్పటి వరకు వెయ్యికిపైగా ఏంజియో గ్రామ్‌లు, 600 మందికి స్టెంట్లు వేసి రోగులకు ఖరీదైన వైద్య సేవలను అందించారు. ఈ ప్రక్రియలో సీతారం పాత్ర వెలకట్టలేనిది. రాష్ట్ర రాజధాని తర్వాత ఖమ్మంలోనే ఉన్న ఈ క్యాథ్‌ల్యాబ్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. క్యాథ్‌లాబ్‌లో ఇప్పటి వరకు 4వేల మంది రోగులకు ఓపీ, ఐసీ 10వేల మందికి మెరుగైన ఖరీదైన వైద్యాన్ని అందించారు. ఒక్కో ఏంజియోకు రూ 12 వేల నుంచి 5వేల వరకు ప్రైవేటు ఆస్పత్రిలో చార్జి చేస్తారు. ఫేస్ మేకర్, బెలూన్ తో రక్తనాళాలను శుభ్రపరిచే సేవలను అందిస్తున్నారు. ఇలా ఆస్పత్రి రోగులకు గుండె సంబంధిత వైద్యచికిత్సలు అందిస్తూ రోగుల గుండెల్లో నిలిచిపోతున్నారు సీతారాం నాయక్.



మణుగూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోరిక సుగుణ

'డెంఘీ'ంకారం

- విజృంభిస్తున్న విష జ్వరాలు
- వందల సంఖ్యకు చేరుతున్న బాధితులు
- తోగ్గూడెంలో అధికంగా జ్వర పీడితులు
- రోజు రోజుకు పెరుగుతున్న రోగులు
- ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స
- టెస్టులకు తడిసిమోపెడవుతున్న ఖర్చు
- ఒంటి నొప్పి, నీరసం, కళ్ల మంటల లక్షణాలు

మణుగూరు టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మణుగూరు డివిజన్‌లో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ జ్వరాలతో ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారు. డివిజన్‌లోని మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం మండలాలతో పాటు ఇతర మండలాల్లో కూడా డెంగీ కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. డెంగీ జ్వరాలతో మణుగూరు ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. రోజుకు పదుల సంఖ్యలో జ్వరపీడితులు ఆస్పత్రిలో చేరుతున్నారు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో కూడా డెంగీ కేసులు ఎక్కువగా ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. మణుగూరులోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 10వతేదీ నుంచి డెంగీ జ్వరంతో వచ్చే వారి సంఖ్య పెరిగింది.

మణుగూరుతో పాటు పినపాక మండల తోగ్గూడెం గ్రామం నుంచి వచ్చిన జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నట్లు ఏరియా ఆస్పత్రి వైద్యులు పేర్కొంటున్నారు. దాదాపు 30 మంది ఈ జ్వరంసోకి వైద్యసేవలు పొంది కొలుకుంటున్నట్లు తెలిపారు. సోమవారం ఏరియా ఆస్పత్రిని 'ఆంధ్రజ్యోతి'ని సందర్శించగా ఈ గ్రామానికి చెందిన 16 మంది రోగులు ప్రస్తుతం వైద్య సేవలు పొందుతున్నారు. వీరంతా నాలుగు రోజుల కిందట ఆస్పత్రిలో చేరారు. ఒళ్లు నొప్పులు, నీరసం, తలనొప్పి, కళ్ల మంటలు, జ్వరంలో హెచ్చుతగ్గులు, రక్త కణాల తగ్గుదల ఉంటున్నాయి.





పాలకూరి సోమయ్య, పుప్పాల నర్సింహారావు

మెరుగైన వైద్యం అందిస్తున్నాం..

డాక్టర్ మార్తి సాయి మోహన్ , ఆర్ఎంవో



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డెంగీ జ్వరానికి మంచి వైద్యం అందిస్తున్నాం. ఏజెన్సీ గ్రామాల్లో డెంగీ జ్వర పీడితులు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుంటున్నారు. ఇప్పటి వరకు పినపాక మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన జ్వర పీడితులు వస్తే వారికి మంచి వైద్యం అందించాం. ప్లేట్‌లెట్స్ తగ్గిన వారికి భద్రాచలం నుంచి రక్తం తెప్పించుకుని నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నాం. రోగులు త్వరగా కోలుకొంటున్నారు. బ్లడ్ బ్యాంక్ ఉంటే మరింత మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది. ఇప్పటి వరకు డెంగీ కేసులను ఎక్కడికి రిఫర్ చేయలేదు.

అధిక భారం.. ఆందోళనలో పీడితులు

డెంగీ సోకిన రోగులు బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందటం అధిక భారంతో కూడుకున్న పని అవుతోంది. రక్త పరీక్షలకు దాదాపు రూ.1500 నుంచి రెండు వేల వరకు ఖర్చవడంతో పేద కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారు. కూలీ చేసుకునే వారు 15 రోజుల పాటు బయటి ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందటం కష్టంగా మారింది. ఇంటిల్లిపాది జ్వరాలతో బాధపడుతుంటే సపర్యలు చేసేవారు కరువయ్యారు.

కూల్‌డ్రింక్ అనుకుని గడ్డిమందు తాగిన బాలుడు

- విషమంగా పరిస్థితి



చికిత్స పొందుతున్న వరుణ్ తేజ్

కరకగూడెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్ అనుకుని గడ్డిమందు తాగిన ఓ బాలుడు చావుబతుకుల మధ్య హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం చొప్పాల గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలివీ. చొప్పాల గ్రామానికి చెందిన జాడి నవీన్, వరలక్ష్మి దంపతుల ఐదేళ్ల వయసున్న చిన్నకొడుకు వరుణ్ తేజ్ ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. అయితే అప్పటికే ఓ రైతు కోసమని తండ్రి నవీన్ గడ్డిమందు తెచ్చి.. కూల్‌డ్రింక్ బాటిల్‌లో ఉంచగా.. దాన్ని కూల్‌డ్రింక్‌గా భావించిన వరుణ్ తేజ్ తాగాడు. కొంత సమయానికి వరుణ్ తేజ్ నోటినుంచి నురుగలు, కడుపునొప్పి రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి 108 వాహనంలో మణుగూరు అక్కడ నుంచి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఖమ్మం జిల్లా ఆస్పత్రి మార్చురీ వద్ద గుమిగూడిన ఇరుకుటుంబాల వారు

ఉసురు తీసిన వేధింపులు?

- భర్త, అత్తింటి వారి మాటలకు అవమానంతో ఖమ్మం రైల్వే ఎస్సై భార్య ఆత్మహత్య
- మృతురాలి తండ్రి ఫిర్యాదుతో భర్త, కుటుంబ సభ్యులపై కేసు

జూలూరుపాడు / ఖమ్మం క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానించడంతో పాటు.. అదనపు కట్నం తేవాలంటూ ఆ వివాహితపై భర్త, అత్తింటి వారి వేధింపులు ఎక్కువవయ్యాయి. దాంతో భరించలేకపోయిన ఆ ఇల్లాలు, ఖమ్మం రైల్వే ఎస్సై బానోత్ రాణా ప్రతాప్ భార్య బానోత్ రాజేశ్వరి(34) నాలుగు రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని రామవరం సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీకి చెందిన రాజేశ్వరికి, ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రాములుతండాకు చెందిన ఎస్సై బానోత్ రాణాప్రతాప్‌కు 2018లో వివాహమైంది. వారికి ఆరేళ్ల కుమార్తె ఖ్యాతిరాణా, నాలుగేళ్ల కుమారుడు రక్షిత్ రాణాలున్నారు. వివాహ సమయంలో రాజేశ్వరి కుటుంబ సభ్యులు రాణాప్రతాప్‌కు రూ.40లక్షల నగదుతో పాటు 35తులాల బంగారం, మరో 4లక్షలు విలువ చేసే వస్తువులను కట్నంగా ఇచ్చారు. కొద్దికాలం వరకు వారి వైవాహిక జీవితం సజావుగానే సాగింది. ఆ తర్వాత రాజేశ్వరికి వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందంటూ భర్త రాణాప్రతాప్, అత్తమామలు పుష్పరాణి, చంద్రంతోపాటు బావ, మహబూబాబాద్ వీఆర్ ఎస్సై బానోత్ మహేష్ కలిసి అనుమానించడం, సూటిపోటి మాటలతో వేధించడం ప్రారంభించారు. తాము చెప్పిన ఇంట్లోనే ఉండి, చెప్పిన విధంగా నడుచుకోవాలంటూ శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసేవారు. తాము చెప్పినట్లు వినకుంటే ఆత్మహత్య చేసుకోవాలంటూ తరచూ ఆమెను ప్రేరేపించారు. ఈ క్రమంలో విసిగిపోయిన రాజేశ్వరి.. భర్త, అత్తింటివారి వేధింపులు భరించలేక అవమాన భారంతో రాజేశ్వరి ఈ నెల 25న తేదీన జూలూరుపాడులోని తాము అద్దెకు ఉంటున్న ఇంట్లో రాత్రి 11:30గంటల సమయంలో పురుగులమందు తాగి.. కొత్తగూడెం సుభాష్‌చంద్రబోస్ కాలనీలోని పుట్టింటి వారికి ఫోన్ చేసి సమాచారమిచ్చింది. దాంతో హుటాహుటిన వారు జూలూరుపాడు చేరుకుని ఆమెను కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఆదివారం రాత్రి 11:25గంటల సమయంలో మృతి చెందింది. తన కూతురు రాజేశ్వరిని భర్త, అత్తమామ, బావలు వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి కేళోత్ సోమ్లా జూలూరుపాడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మృతురాలు భర్త, అత్తామామలు, బావలపై కేసు నమోదు చేసిన పోలీసులు.. రాజేశ్వరి భర్త, ఖమ్మం రైల్వే ఎస్సై బానోత్ రాణా ప్రతాప్, అతడి తండ్రి బానోత్ చంద్రంను అరెస్ట్ చేశారు. వారిద్దరిని రిమాండ్‌కు తరలించినట్టు జూలూరుపాడు ఎస్సై రవి తెలిపారు.

ఖమ్మం ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత..

రాజేశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్ నుంచి ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తీసుకొచ్చిన క్రమంలో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఇరు కుటుంబాల వారు వాగ్వాదానికి దిగారు. రాణాప్రతాప్ తండ్రి చంద్రం అక్కడకు వచ్చిన రాజేశ్వరి బంధువులను దుర్భాషలాడటంతో వారు అతడిపై దాడికి యత్నించారు. దీంతో పోలీసులు భారీగా మోహరించి వారిని అడ్డుకుని చంద్రంను బయటకు తరలించారు. కాగా తన కుమార్తె మృతికి మామ చంద్రం, అత్త పుష్పరాణి, భర్త రాణాప్రతాప్, బావ మహేష్‌లే కారకులని వారిపై చర్యలు తీసుకోవాలని రాజేశ్వరి తండ్రి సోమ్లా ఆరోపించారు. రాజేశ్వరిని తీవ్రంగా గాయపరిచి ఇబ్బందులకు గురిచేయడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని, అదేవిధంగా వారి కుటుంబానికి, రాణాప్రతాప్‌కు పలు రూపాల్లో సుమారు రూ.కోటికిపైగా ఇచ్చానని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద రోదిస్తూ చెప్పాడు.

ఆ ఎస్సైతీరు ఆదినుంచి వివాదాస్పదమే...

రాణాప్రతాప్ తీరు ఆదినుంచి వివాదాస్పదంగానే ఉండేదన్న ఆరోపణలున్నాయి. గతంలో ఖమ్మంపాతబస్టాండ్ కాంప్లెక్స్‌లో ఉన్న ఓ చెప్పుల దుకాణం యజమానితో గొడవకు దిగి గన్‌తో బెదిరించిన సంఘటన అప్పట్లో హల్‌చల్ అయింది. అదేవిధంగా మహబూబాబాద్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ కారు విషయంలో రాణాప్రతాప్‌పై ఆరోపణలు రావడంతో విచారణ ఎదుర్కొని జూలూరుపాడులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో రాణాప్రతాప్ సస్పెండ్ అయ్యారు. అనంతరం ఖమ్మంలో రైల్వే ఎస్సైగా విధుల్లో చేరి కొనసాగుతున్నారు.

పగబట్టిన విధి..

- కూతురి వైద్యం కోసం అప్పులు
- తీర్చలేక తండ్రి బలవన్మరణం..

కూసుమంచి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆ పేద కుటుంబంపై విధి పగబట్టింది. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన కూతురు పూర్తిగా కోలుకోలేదు. ఆమె వైద్యం కోసం తండ్రి స్థాయికి మించి అప్పులు చేసి.. చివరకు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదసంఘటన కూసుమంచి మండలం ధర్మతండాలో జరిగింది. ధర్మాతండాకు చెందిన జర్పుల పరుశురాం(40)కు ఓ కూతురు, కుమారుడున్నారు. కాగా రెండేళ్లక్రితం ఖమ్మంలో పరీక్షలు రాసి ఇంటికి వస్తుండగా జీళ్లచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమారుడు దుర్మరణం చెందగా, కూతురుకు బలమైన గాయాలయ్యాయి. దాంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేర్చగా.. సుమారు రూ.25లక్షల వరకు ఖర్చయింది. దానిలో సుమారు రూ.15లక్షల మేర దాతల నుంచి అందగా.. మిగిలింది అప్పుగా తెచ్చాడు. అయినా ఫలితం లేకుండా పోయింది. రెండేళ్లుగా వైద్యం అందిస్తున్నా ఆమె ఆరోగ్యం 50శాతం మాత్రమే మెరుగుపడింది. ఆ తర్వాత మందులు, ఇతరత్రా అవసరాలకు నెలకు రూ.50వేల వరకు ఖర్చవుతోంది. దీంతో ఎన్నో వ్యయప్రయాసలోకోర్చుతూ నెట్టుకొస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పరుశురాం తన కూతురును కాపాడుకొనేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఇంటికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి, తాను కౌలుచేస్తున్న వ్యవసాయభూమిలో ఉన్న బావిలో దూకాడు. వెంటనే కుటుంబసభ్యులు, తండావాసులు అక్కడకు వెళ్లి అతడిని కాపాడే ప్రయత్నం చేయగా.. అప్పటికే మరణించాడు. పరశురాం భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పరశురాం మృతితో తండాలో విషాదం అలుముకోగా.. భర్త ఆత్మహత్యతో భార్య కన్నీరుమున్నీరవుతోంది. పూర్తిగా కోలుకోని స్థితిలో ఉన్న కూతురిని, తనను సాకేదెవరంటూ రోదిస్తోంది. ఇదిలా ఉండగా మృతుడి కుటుంబానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడొకరు రూ.10వేల ఆర్థికసాయం అందించారు.



పరుశురాం (ఫైల్)

బ్లడ్‌బ్యాంకుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- అక్రమంగా నిల్వ ఉంచిన బ్లడ్ బ్యాగుల స్వాధీనం



బ్లడ్‌బ్యాంకులో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విధుర బ్లడ్ బ్యాంకులో అక్రమంగా నిల్వ ఉంచిన బ్లడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతీబాయి తెలిపారు. సోమవారం నగరంలోని బ్లడ్ బ్యాంకులను టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ అరవింద్, జిల్లా అభివృద్ధి అధికారి, కె.రాంగోపాల్ రెడ్డి ఖమ్మం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, కొత్తగూడెం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విధుర బ్లడ్ బ్యాంకులో బ్లడ్ నిలువలు వేరే చోట మరొక గదిలో నిలువ చేయటాన్ని బృందం గమనించారు. ఈ గదిలో పరిశీలించి నిల్వ ఉంచిన బ్లడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి సేకరించిన బ్లడ్‌ప్యాకెట్లను ఫ్రీజర్‌లో ఉంచాల్సి ఉందని నిబంధనల ప్రకారం ఎక్కడైతే అనుమతులు ఉంటాయో అక్కడే నిల్వ ఉంచాలని కానీ ఇక్కడ వేరే ప్రాంతంలో నిల్వ ఉంచడాన్ని వారు ప్రశ్నించారు. ఆ బ్లడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని శాంపిల్స్‌ను ఐపీఎం ల్యాబ్ కు పంపినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. పరీక్షలు నిర్వహించిన తర్వాత వీటిపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. తొలుత నోవా కేర్ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు. అన్ని అనుమతులను పరిశీలించి, నిర్వహణ రిజిస్టర్లను, నిర్వాహణ సిబ్బంది వివరాలు అడిగితెలుసుకున్నారు. బ్లడ్ తీసే విధానం, దానిని నిలువ చేసే పద్ధతులను పరిశీలించారు. తలసీమియా రోగులకు అందిస్తున్న బ్లడ్ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. బ్లడ్ బ్యాంకుల నిర్వహణ నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, బ్లడ్ బ్యాంకు ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డెమో జి.సాంబశివరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

పాలేరులో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి, జూన్30(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పాలేరు నియోజవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 8:30కు ఏదులాపురం మునిసిపాలిటీలోని సాయి గణేష్‌నగర్‌లో అర్బన్ ఏరియాలో 100రోజుల ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొంటారు. 9గంటలకు మున్నేరు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ ఇళ్లకోల్పోయిన బాధితులకు పట్టాలు పంపిణీ చేస్తారు. 9:30గంటలకు పొన్నెకల్ నుంచి నర్సింహాపురం బీటీ రోడ్డు నిర్మాణానికి పొన్నెకల్లులో పనులు ప్రారంభిస్తారు. అనంతరం కూసుమంచి క్యాంపుకార్యాలయం చేరుకుని ప్రజల నుంచి సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరిస్తారు.

నగరాన్ని కమ్మేస్తున్న ప్లాస్టిక్ భూతం

- రోజుకు సుమారు 7టన్నుల వ్యర్థాలు
- 2023 తర్వాత జరిమానాల జోలికెళ్లని కేఎంసీ అధికారులు
- నియంత్రణకు ఓ ప్రత్యేక అధికారి నియామకం
- ఇతర విధుల కేటాయింపుతో కష్టతరంగా పర్యవేక్షణ



డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు, ప్రధాన రహదారుల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు

ఖమ్మంకార్పొరేషన్, జూన్30(ఆంధ్రజ్యోతి): వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం ఖమ్మం. ఎంతో చైతన్యవంతమైన ప్రజలున్న ఖమ్మాన్ని ప్లాస్టిక్ భూతం కమ్మేస్తోందది. రోజు రోజుకు ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరుగుతుండటంతో పరిసరాలు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుతున్నాయి. డ్రెయినేజీల్లో కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను పడేస్తుండటంతో ఫలితంగా మురుగు నీరు సక్రమంగా పోవడం లేదు. ఇక అన్ని వ్యాపారాల్లోనూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం విచ్చల విడి కావడంతో నియంత్రణకు నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు, రోజు వారీ తనిఖీలు చేపట్టటం లేదు. దీంతో చిరు వ్యాపారుల నుంచి కార్పొరేట్ సంస్థల వరకు ఇష్టానురీతిగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు.

2023లో మోడల్‌గా నిలిచిన ఖమ్మం

ప్లాస్టిక్ నిషేధంలో నగరంలో 2022-23లో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. నాటి కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌పై రోజు వారీగా డ్రైవ్‌లు చేపట్టారు. కనీసం రూ.2వేలనుంచి రూ.30వేల వరకు జరిమానాలు విధించారు. సుమారు తొమ్మిది దుకాణాలు సీజ్ చేశారు. దీంతో ఖమ్మంలో చాలా కాలం బహిరంగ మార్కెట్‌లో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలు జరపలేదు. క్రమంగా అధికారులు పర్యవేక్షణ లోపించడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.దీంతో నగరంలో పారిశుధ్య సిబ్బంది రోజుకు 180 టన్నుల చెత్తను సేకరిస్తుండగా.. అందులో 7 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయంటే పరిస్థితెలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక అధికారి

పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, నిషేధిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు, వినియోగాన్ని నియంత్రించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానా విధించేందుకు గాను ఖమ్మం నగర పాలక సంస్థలో ఒక పర్యావరణ ఇంజనీరింగ్ అధికారి ఉన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జరాయివు, స్వీపింగ్ వాహనాలతో పాటుగా స్వచ్ఛ సర్వేక్షణ్ లాంటి అనేక కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఖమ్మం నగర పాలక సంస్థకు స్వచ్ఛతా అవార్డులను తీసుకరావటంలో ఈ అధికారి పాత్ర కీలకంగా ఉంటుంది. కానీ కొంతకాలంగా ఆ అధికారి ఇతర పనులకు కేటాయించటంతో ప్లాస్టిక్ నియంత్రణ పర్యవేక్షణ ఆయనకు కష్టతరంగా మారింది. పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పించే వారు కనిపించటం లేదు. ప్రస్తుతం నగరంలో ఉన్న ఈ పరిస్థితిపై కేఎంసీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావును వివరణ కోరగా తనకు కేటాయించిన బాధ్యతలను తాను నిర్వర్తిస్తున్నానని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

- తెలంగాణ ఉద్యమకారుల శాంతియుత దీక్ష



శాంతియుత దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారులఫోరం డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొత్తబస్టాండ్ ఎదురుగా సోమవారం శాంతియుత దీక్షను నిర్వహించారు. ఈదీక్షా శిబిరాన్ని సీనియర్ ఉద్యమకారుడు అర్వపల్లి విద్యాసాగర్, సీపీఐ జిల్లా కార్యదర్శి సింగు నరిసింహారావు ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రస్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250గజాల స్థలం ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు, అమరవీరుల కుటుంబాలకు రూ.25వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు.కానీ అమలు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శిబిరాన్ని పొలిటికల్‌జేఏసీ మాజీ జిల్లా కన్వీనర్ కూరపాటి రంగరాజు నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు. ఈకార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఖమ్మం ఉమ్మడి జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, అర్వపల్లి విద్యాసాగర్, బచ్చల పద్మాచారి, జడల వెంకటేశ్వరరావు, పాలకుర్తి కృష్ణ, బట్టు రాజేందర్ నాయక్, రెడ్డబోయిన వరలక్ష్మి పాల్గొన్నారు.

చెన్నారం సొసైటీ కార్యదర్శి హఠాన్మరణం

వైరా, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండలంలోని చెన్నారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) కార్యదర్శి ఎస్వీసత్యనారాయణ (64) గుండెపోటుతో మృతి చెందారు.



చెన్నారం పీఏసీఎస్ కార్యదర్శిగా పని చేస్తున్న సత్యనారాయణ నేలకొండపల్లి మండలంలో అమ్మగూడెంలో భార్య, పిల్లలతో నివాసముంటున్నారు. సోమవారం ఖమ్మం వచ్చి కూనవరం వెళ్లేందుకు భద్రాచలం వెళ్తున్న డీలక్స్ బస్సు ఎక్కారు. ఖమ్మం నుంచి భద్రాచలానికి టిక్కెట్ తీసుకున్నారు. వైరా బస్టాండ్‌కు వచ్చిన తర్వాత పక్కనున్న తోటి ప్రయాణికుడితో వంటినొప్పిగా ఉందని చెప్పి కొన్ని మంచినీళ్లు తాగారు. బస్టాండ్ నుంచి బస్సు జాతీయ ప్రధాన రహదారిలోని పోలీస్‌స్టేషన్ సమీపానికి వచ్చే సమయానికి శ్వాస ఆడక సత్యనారాయణ తీవ్ర ఇబ్బందిపడ్డాడు. ఆవెంటనే 108 వాహనంలో చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. సత్యనారాయణకు ఇంకా కేవలం ఏడాది మాత్రమే కార్యదర్శిగా సర్వీస్ ఉంది. ఏపీలోని కూనవరం ఆయన స్వస్థలం. అక్కడకు వెళ్తూ గుండెపోటుతో మార్గమధ్యలోని వైరాలో హఠాన్మరణం చెందారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం, జూన్30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన రైతులు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని కొత్త ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందించారు. సీపీఐఎంఎల్ కార్యకర్తలు నిరసన తెలిపారు.

మాంసం వ్యర్థాలు వేస్తే చర్యలు



- ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మంరూరల్, జూన్30(ఆంధజ్యోతి): ఖమ్మం- సూర్యాపేట ప్రధాన రహదారి వెంబడి కాలువలో చికెన్, చేపలు, మటన్ వ్యర్థాలు వేసేవారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని ప్రధాన కాలువలో నిలిచిపోయిన చెత్త, చెదారాన్ని సోమవారం జేసీబీతో తొలగించారు. కాలువలో చికెన్, చేపలు, మటన్ వ్యర్థాలు వేయడం ద్వారా పారిశుధ్య సమస్యలు, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కాలువకు ఇరువైపులా ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటి నుంచి దుకాణదారులు కాలువలో వ్యర్థాలు పడవేస్తే చట్టపరంగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం

దీక్షలు స్వీకరించిన సాయిబాబా భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జులై 10న గురుపౌర్ణమి పురస్కరించుకొని జిల్లాలోని పలు సాయిబాబా ఆలయాల్లో సోమవారం నుంచి గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. పలువురు భక్తులు సాయి మాలధారణ దీక్షలు తీసుకున్నారు. నగరంలోని శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో 25వ గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమైనాయని ఆలయ చైర్మన్ లగడపాటి. రామారావు తెలిపారు. గాంధీచౌక్ వరప్రదాత షిర్డి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. సుమారు 300 మంది భక్తులు సాయిమాల దీక్షధారణ తీసుకున్నారు.



రంగనాయకుల గుట్టలో మాలధారణ చేస్తున్న భక్తులు

మున్నేరు నిర్వాసితులకు అండగా ఉంటా

మాజీ మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మంమార్కెట్, జూన్30(ఆంధ్రజ్యోతి): మున్నేరు రిటైనింగ్‌వాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితులకు అండగా ఉంటానని మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం మున్నేరు నిర్వాసితులు ఆయనను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. పేదవాళ్ల భూములు గుంజుకొని ఎక్కడో ప్లాట్లు ఇస్తామని మభ్యపెడుతున్నారన్నారు. వారికి 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెడితే ప్రభుత్వంపై పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం తదితరులు ఉన్నారు.



మున్నేరు నిర్వాసితులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

బాధిత కుటుంబాలకు పరామర్శ

రఘునాథపాలెం: మండల కోఆప్షన్ సభ్యుడు భూక్య చందు తల్లి అమ్మి ఇటీవల మరణించారు. సుకినీతండాలో సోమవారం జరిగిన సంస్మరణ సభలో పువ్వాడ అజయ్‌కుమార్ ఆమె చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు అందించారు. మాజీ వైస్‌ఎంపీపీ గుత్తా రవికుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వీరునాయక్,మాజీసర్పంచులు మెంటం రామారావు, ప్రదీప్, మాదంశెట్టి హరిప్రసాద్, నున్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో సుపరిపాలన వేడుకలు

ఖమ్మం మార్కెట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని 51వ డివిజన్‌లో సోమవారం బీజేపీ 11ఏళ్ల సుపరిపాలన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, నాయకులు అల్లిక అంజయ్య, నున్న రవి తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లి,దండ్రులు, పీడీఎస్‌యూ నాయకులు

బెస్ట్ అవైలబుల్ విద్యార్థులకు బిగ్ షాక్

- పెండింగ్‌లో రెండేళ్ల బిల్లులు
- విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న రెండు ప్రైవేట్ పాఠశాలలు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ధర్నా చేపట్టిన విద్యార్థులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్30(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ ద్వారా ఎస్సీ నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ విద్యా పథకం ప్రవేశపెట్టింది. జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన విద్యార్థులను ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో వసతి గృహంతో కూడిన ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇలా జిల్లాలో ఏడు ప్రైవేట్ పాఠశాలల ద్వారా ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యాభ్యాసం అందుతోంది. అయితే రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు రావాల్సిన బిల్లులు రాలేదు. దీంతో జిల్లాలోని 7 పాఠశాలల్లో ఐదుపాఠశాలల యాజమాన్యాలు ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాయి. కానీ ఖమ్మంలోని రెండు పాఠశాలలు మాత్రం బెస్ట్ అవైలబుల్ విద్యార్థులను ఇబ్బందికి గురి చేస్తున్నాయని ఆయా పాఠశాలల విద్యార్థులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తల్లిదండ్రులతో వచ్చి కలెక్టర్ అనుదీప్‌ను కలిశారు. విద్యాభ్యాసం ప్రారంభంలోనే ఇబ్బందులు ఎదురైతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ అనుదీప్ సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాలసత్యనారాయణను పిలిపించారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగూరి వెంకటేష్ నాయకులు సంఘీభావం తెలిపారు.

చివరి విధులు గౌరవప్రదంగా

రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వ వాహనంలో ఇంటికి పంపిన కేఎంసీ కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్, జూన్30 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పాటు ఖమ్మంనగర పాలక సంస్థలో పలు విభాగాల్లో సేవలు అందించిన ఆరుగురు ఉద్యోగులు పదవీ విరమణ సందర్భంగా వారికి సరైన గౌరవం దక్కింది. మేహబూబ్‌అలీ, గంట అచ్చయ్య, ఎం.గురుస్వామి, వోలికి గోపయ్య, ఎం.సుబ్బారావు, కే.చిన్నవెంకయ్య పలువిభాగాల్లో ఖమ్మం నగరంలో బాధ్యతలు నిర్వహించారు. సోమవారం పదవీ విరమణ పొందారు. కాగా కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ప్రభుత్వ వాహనంలో వారి నివాసాలకు పంపారు. దీంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం నగర పాలక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రభుత్వ జీపులో బయలుదేరిన రిటైర్డ్ ఉద్యోగులు

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన శ్రీనివాస్

విశ్రాంత అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నేలకొండపల్లి, జూన్30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన గొప్ప ఉపాధ్యాయుడు హరి శ్రీనివాస్ అని విశ్రాంత అదనపు కలెక్టర్ గండికోట భాస్కరరావు అన్నారు. సోమవారం శ్రీనివాస్ ఉద్యోగ విరమణను పురస్కరించుకుని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన సన్మాన సభలో ప్రధానోపాధ్యాయురాలు కావూరి ఫణి కుమారి అధ్యతన జరిగిన సన్మాన సభలో భాస్కరరావు మాట్లాడారు. తాను చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా చేసిన ఘనత శ్రీనివాస్‌దన్నారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న హరి శ్రీనివాస్ మాట్లాడుతూ తోటి ఉపాధ్యాయుల సహాయ, సహకారాలతోనే పాఠశాలను మండలంలో అగ్రగామిలో ఉంచగలిగానన్నారు. సహకరించినట్లు శ్రీనివాస్ చెప్పారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆత్మీయులు శ్రీనివాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, కాసాని నాగేశ్వరరావు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



హరి శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

హైవే పక్కనే ఐటీఐ కాలేజీ నిర్మించాలి

తిరుమలాయపాలెం, జూన్30(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలేనికి మంజూరైన ఐటీఐ కాలేజీని హైవేరోడ్డు ప్రక్కన నిర్మిచాలని కోరుతూ విపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో సిలార్‌సాహెబ్,తహసీల్దార్ లూథర్‌విల్సన్‌కు వినతిపత్రం అందించారు. ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బీఎస్పీ నాయకులు వెన్నబోయిన రమేష్, తిమ్మిడి హనుమంతరావు, కొమ్మూ పూలే, కృష్ణ, అశోక్, బాబు, మదు,తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధురాలు మహబూబీ

కామేపల్లి, జూన్30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హక్కులకు కోసం పోరాడిన పోరాట కార్మిక యోధురాలు ఎస్కే మహబూబిఅని సీఐటీయు జిల్లా కార్యదర్శి తుమ్మ విష్ణు కొనియాడారు. సోమవారం పండితాపురంలో ఆమె సంస్మరణ సభలో మాట్లాడారు.

హామీలు నిలబెట్టుకోవాలి: సీపీఐ

ఖమ్మంరూరల్,జూన్30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండల పరిధిలోని పడమటి తండాలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభను నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వెంకటరెడ్డి, గిరిజనసంఘం రాష్ట్రనాయకులు రాంమూర్తి నాయక్, మండల కార్యదర్శి సుధాకర్, మోహన్‌రావు, భాస్కర్, సైదులు, వీరభద్రం, గాంధీ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కామేపల్లి,జూన్30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన యర్రగడ్ల బాబు ఇటివల గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన జ్ఞాపకారం ఆయన కుమారుడు నాగరాజు, కుమార్తె సత్యవతి ఇద్దరు కలిసి యర్రగడ్డ బాబు విద్యాజ్యోతి అనే కార్యక్రమంలో గ్రామ పాఠశాలలోని విద్యార్థులకు బుక్స్ బ్యాగులు ఇతర సామగ్రి పంపిణి చేశారు. కామేపల్లి హైస్కూల్‌లో పదోతరగతిలో ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.10వేలు, ద్వితీయ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.6వేల ప్రోత్సాహం అందజేస్తానని ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ జీ.వెంకట్, హైస్కూల్ హెచెం శైలా, తాళ్లగూడెం హెచ్‌ఎం నర్సింహరావు ఉపాధ్యాయులు కిషన్, పుష్ప, విజయ గ్రామస్తులు పుచ్చకాయల కోటయ్య, వెంకటనర్సయ్య, ఎర్రబోయిన నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రేషన్‌కార్డుల ప్రక్రియ వేగవంతం

తల్లాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తరేషన్‌కార్డల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తహసీల్దార్ వి.సురేస్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రేషన్‌కార్డుల కోసం మీసేవా కేంద్రాల ద్వారా 1,398 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 906 రేషన్‌కార్డులుజారీ చేసినట్లు వివరించారు. మిగిలిన 493 రేషన్‌కార్డుల్లో 300 వరకు ఆన్‌లైన్ చేస్తున్నామని, మరో 193 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జూన్ రెండో తేది నుంచి 20వతేదీ వరకు భూభారతి సభలు ఉండడం వల్ల కొంత ఆలస్యం జరిగిందన్నారు. ఇందులో మిగతావి కూడా సకాలంలో పూర్తిచేస్తామన్నారు. కార్డులు రానివారు ఆందోళన చెందవద్దన్నారు.

రహదారిపై గుంతలు.. బాటసారులకు కష్టాలు

- రోడ్డు మధ్య పైపులైన్ కల్వర్టుకు రంధ్రాలు
- అతికష్టంగా వాహనాల రాకపోకలు



బస్సు దిగి నడిచి వస్తున్న విద్యార్థులు

కొణిజర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదం జరిగితే భారీ నష్టం జరగక తప్పదు. రహదారి మధ్యలో వరద నీరు వెళ్లేందుకు వేసిన పైపుకల్వర్టులు వర్షానికి కుంగి రోడ్డుమీద ఉన్న తారకొట్టుకపోయి పైపుకు గుంతలు పడి ప్రమాదంగా తయారైంది. గతంలో ఇదే కల్వర్టుకు గుంతలు పడినప్పటికి తూతూమంత్రంగా మరమ్మత్తులు చేయడంతో మరల గుంతలు పడ్డాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క వర్షానికి కల్వర్టుకు బుంగలు పడితే భవిష్యత్తులో వచ్చే వర్షానికి రోడ్డు ఉంటదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కొణిజర్ల, మల్లుపల్లి గ్రామాల మధ్య రహదారి గుంతలమయంగా తయారయ్యింది.

ఒక్క వర్షానికే కుంగిన కల్వర్టు:

కొణిజర్ల, మల్లుపల్లి గ్రామాల మధ్య చింతల చెరువు సమీపంలో వరద నీరు వాగులోకి వెళ్లేందుకు రోడ్డు మధ్యలో పైపుకల్వర్టును ఏర్పాటు చేశారు. ఆ కల్వర్టుపై నుంచే తార రోడ్డును నిర్మించారు. ఒక్కరోజు కురిసిన వర్షానికి రోడ్డు మధ్యలో ఉన్న పైపుకల్వర్టు కుంగి తార కొట్టుకపోయి పైపుకు మూడు చోట్ల రంధ్రాలు పడ్డాయి. ఆ రంధ్రాలు కూడ రహదారి మధ్య ఉండడంతో ఆ రోడ్డులో ప్రయాణం ప్రమాదంగా మారింది. సోమవారం అతికష్టం మీద ద్విచక్రవాహనాలు, ఆటోలు అటు వైపు నుంచి వెళ్లాయి గాని స్కూల్ బస్సులు మాత్రం వెళ్లలేకపోయాయి. విద్యార్థులను ఎక్కించుకున్న ప్రైవేటు పాఠశాల బస్సు ఒకటి ఆ ప్రమాదకర రోడ్డు దగ్గర వచ్చి బస్సు వస్తే కల్వర్టు పూర్తిగా కుంగి ప్రమాదం జరుగుతుందని డ్రైవర్ గ్రహించి విద్యార్థులను దింపి ఖాళీ బస్సుతో ఎట్టకేలకు రోడ్డుదాటాడు. విద్యార్థులంతా నడుచుకుంటూ వచ్చి తిరిగి బస్సును ఎక్కారు. మల్లుపల్లి, రామనర్సయ్యనగర్ గ్రామాలకు బస్సులు వెళ్లాలంటే ఈ రోడ్డులోనే వెళ్లాలి. ప్రమాదం పొంచి ఉండడంతో తాత్కాలికంగా బస్సులను నిలిపివేశారు. మరల వర్షం వస్తే ఉన్న పైపుకల్వర్టు మొత్తం కూలిపోతుందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని పూర్తిస్థాయి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

గతంలోనూ కల్వర్టుకు రంధ్రాలు:

ఇదే కల్వర్టుకు పోయినేడాది కూడా రంధ్రాలు పడ్డాయి. తాత్కాలికంగా మరమ్మత్తులు చేసి వదిలేయడం వల్లే మరల రంధ్రాలు పడ్డాయని ప్రమాదం జరిగే ఎవరు బాధ్యత వహించాలని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ముందు ప్రమాదస్థలాలను గుర్తించడంలో అధికారులు విఫలం అవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రుల వేళ ఎవరూ చూడకపోతే ఏ ప్రమాదం జరుగుతందోనని ప్రజలు భయపడుతున్నారు. భారీ ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.



కొణిజర్ల-మల్లుపల్లి మధ్య చింతల చెరువు దగ్గర రహదారిలో పైపుకల్వర్టుకు పడిన గుంతలు

పదకొండేళ్ల మోదీ పాలనలో
రాజ్యాంగ వ్యవస్థలు విధ్వంసం: సీపీఎం

సత్తుపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అనుసరించిన నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలతో ఈ పదకొండేళ్లలో చట్టబద్ధ, రాజ్యాంగ వ్యవస్థలు విధ్వంసమయ్యాయని సీపీఎం జిల్లా అకడమిక్ సెల్ బాధ్యులు బండారు రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం సత్తుపల్లి పట్టణం, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో సోమవారం రెండు రోజుల పాటు సాగే రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గతంలో ఎన్నికల కమిషనర్‌ను నియమించే ప్రక్రియలో ఉన్న న్యాయవ్యవస్థ భాగస్వామ్యాన్ని పూర్తిగా తొలగించి, కమిషనర్‌ను ఎన్నుకునే విషయంలో కేంద్రానికి పూర్తిగా అధికారాలు ఇచ్చిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా రాజ్యాంగంలో లౌకిక, సోషలిస్టు పదాలను పూర్తిగా తొలగించి దేశాన్ని ఏకకేంద్ర రాజ్యాంగంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేవరకు సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మాచర్ల భారతి, శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండురంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, పాకలపాటి ఝాన్సీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండారు రమేష్

పాఠశాలకు పూర్వ విద్యార్థి సహాయం

వేంసూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేంసూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-85బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి, అరవింద్ ఫార్మాకంపెనీ వైస్‌చైర్మన్ డాక్టర్ నాగులవంచ శ్రీనివాసరావు పాఠశాల అభివృద్ధికి నడుంబిగించారు. తండ్రి నాగులవంచ పుల్లయ్య జ్ఞాపకార్థం విద్యార్థులకు బ్యాగులు అందించారు. కంప్యూటర్ కోర్సు బోధించే మహిళకు నెలకు రూ.పదివేలు వేతనం అందిస్తున్నారు. అలాగే మధ్యాహ్నభోజన హాల్‌ను కూడా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న శ్రీనివాసరావు(ఫైల్)

సొసైటీ సిబ్బంది మొక్కలు నాటాలి

ముదిగొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి సొసైటీ కార్యాలయ ఆవరణలో తప్పనిసరిగా మొక్కలు నాటాలని నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ లునావత్ సుజిత్‌కుమార్ అన్నారు. సోమవారం ముదిగొండ నూతన సొసైటీ కార్యాలయ ఆవరణంలో చైర్మన్ తుపాకుల యలగొండస్వామితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ సహకార సంవత్సరోత్సవం సందర్భంగా అన్ని సొసైటీ కార్యాలయాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, డైరెక్టర్ రాయల శ్రీనివాసరావు, డీసీసీబీ మేనేజర్ అలేఖ్య, సీఈవో వెంకటరత్నం, బాషా, శ్రీను, జానిమియా, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారుల కోసం ఇసుకరీచ్‌లు ప్రారంభం

బోనకల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం మండలంలోని రాయన్నపేట, బ్రాహ్మణపల్లి, కలకోట, రాయనపేట గ్రామాల్లో గల ఏటి ఒడ్డున ఇసుక రీచ్‌లను తహసీల్దార్ ఎం. రమాదేవి, ఎంపీడీవో ఆర్. రమాదేవిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల కొరకు ఇసుక కొరత తలెత్తకుండా ఇసుక రీచ్‌లను ప్రారంబిచండం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణదారులకు మాత్రమే ఇసుక కూపన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐకేపీ ఏపీఎం సురేందర్, సీసీలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, ఝాన్సీ పాల్గొన్నారు.



ఇసుకరీచ్‌లను ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేయాలి-బీఆర్ఎస్

మధిర రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని మధిర బీఆర్ఎస్ నాయకులు సోమవారం మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా పట్టణంలో పలు వార్డుల్లో జరుగుతున్న అండర్ డ్రెయినేజీ పనులను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు అరిగె శ్రీను, వంకాయలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సీసీ రోడ్లు తవ్వి రోజులతరబడి పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయించాలని కోరారు. నాయకులు వైవీ.అప్పారావు, అయిలూరి ఉమామహేశ్వర్‌రెడ్డి, మాధవి, నాగబాబు, భాస్కర్‌రెడ్డి, కొత్తపల్లి నర్సింహారావు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



రమేష్‌కు ట్రైసైకిల్‌ను అందజేస్తున్న అన్నపూర్ణ

పెనుబల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జొన్నెబోయిన ట్రస్ట్ ఆధ్వర్యంలో వీఎంబంజర్‌కు చెందిన పంకు రమేష్ అనే దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను సోమవారం అందజేశారు. రమేష్‌కు కాళ్లు, చెవులు పని చేయకపోవడంతోపాటు తండ్రి చిన్న వయస్సులోనే మృతిచెందాడు. తల్లి కూలీపనులు చేస్తూ రమేష్‌ను పోషిస్తోంది. ఐదేళ్ల క్రితం రమేష్‌కు ట్రైసైకిల్‌ను అందజేశారు. అది పాడైపోవడంతో జొన్నెబోయిన ట్రస్ట్ ఆధ్వర్యంలో మరో ట్రైసైకిల్‌ను నిర్వాహకురాలు జొన్నెబోయిన అన్నపూర్ణ అందజేశారు. రమేష్ వీఎంబంజర్‌లో బిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకురాలు జొన్నెబోయిన అన్నపూర్ణ, బెజవాడ వెంకటరామారావు(చంటి) పాల్గొన్నారు.

సీతమ్మకు నివాళులర్పించిన తాతా, సండ్ర

తల్లాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నవల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి మాతృమూర్తి సీతమ్మకు ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు నివాళులర్పించారు. సోమవారం కుర్నవల్లిలో సీతమ్మ దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రదీప్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష , కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకటలాల్, నాయకులు వజ్రాల రామిరెడ్డి, జీవీఆర్, బద్దం కోటిరెడ్డి, కాంపాటి జమలయ్య, దగ్గుల రాజశేఖరరెడ్డి, అయిలూరి శివారెడ్డి, పోతురాజు వెంకటయ్య పాల్గొన్నారు.



సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాతా, సండ్ర

కేజీబీవీ టీచర్ల
సమస్యలను పరిష్కరించాలి

బోనకల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక కేజీబీవీలో సోమవారం నిర్వహించిన ఆ సంఘ క్యాంపెయిన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, సమ్మె కాలపు జీతాన్ని చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ నాయకులు రంగారావు, సదాబాబు పాల్గొన్నారు.

వైరా ఐఎంఎల్ ఇన్‌చార్జ్ డీఎంగా రమేష్

వైరా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఉమ్మడి ఖమ్మంజిల్లా ఐఎంఎల్ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్‌గా రమేష్ నియమితులయ్యారు. ఆమేరకు తెలంగాణ రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు సంవత్సరాల నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్న చేకూరి నారాయణరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో హన్మకొండ ఐఎంఎల్ 1డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్‌ను వైరాకు బదిలీ చేశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

వైరా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో వైరా మునిసిపాలిటీ పదోవార్డు గండగలపాడుకు చెందిన పేదలు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం సమర్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని గండగలపాడుకు చెందిన పేదలు, సీపీఎం నాయకులు తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి, గుమ్మా నర్సింహారావు, కామినేని రవి, వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

5న మధిరలో
న్యాయవాద అవగాహన

మధిర రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జూలై 5న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో మధిరలో న్యాయవాద అవగాహన తరగతులు జరుగనున్నాయని, ఈ తరగతులకు రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి బి.చంద్రకుమార్ హాజరుకానున్నారని సీనియర్ న్యాయవాది వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం మధిరలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో వీటిని ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం విఫలం

- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

కొణిజర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం అవుతున్నారని, దీనిని ప్రజావ్యతిరేక విధానాలలో భాగంగా చూడాల్సివస్తుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సోమవారం మండలంలోని ఎల్లన్ననగర్‌లో జరిగిన డివి కృష్ణ మూడవ వర్ధంతిసభలో ఆయన మాట్లాడారు. డివి కృష్ణ నిజాంబాద్ జిల్లా బీడీ కార్మికుల కష్టాలకు ఫలితం దక్కాలని ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరడారని తెలిపారు. జిల్లా నాయకులు సీవై పుల్లయ్య, ఆవుల ఆశోక్, కోలేటి నాగేశ్వరరావు, ఎస్‌కే లాల్ మియా, పాశం అప్పారావు, గోగుల సోములు, శివ, రాపోలు కృష్ణ, లక్ష్మణ్, మేడికొండలు, భద్రయ్య, శ్రీను, వెంకటి పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

కొణిజర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆశాజ్యోతి యుఎస్ఏ వారి సహకారంతో మండల పరిధిలోని తనికెళ్ల హరిజన కాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా బ్యాగులు, నోట్‌పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి సంస్థ ప్రతినిధి నందన్‌కుమార్ మాట్లాడుతూ. రెండు తెలుగు రాష్ట్రాల్లో చదివే పేద విద్యార్థులకు ఆశాజ్యోతి సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. హెచ్‌ఎం వాసిరెడ్డి రాంమ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో చెన్నారం సొసైటీ కార్యదర్శి మృతి

వైరా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి భద్రాచలం డిపో బస్సులో కూనవరం వెళ్తూ మార్గమధ్యలోని వైరాలో ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలంలోని చెన్నారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)కార్యదర్శి ఎస్వీ.సత్యనారాయణ(59) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. చెన్నారం పీఏసీఎస్ కార్యదర్శిగా పనిచేస్తున్న సత్యనారాయణ నేలకొండపల్లి మండలంలో అమ్మగూడెంలో భార్య, పిల్లలతో నివాసముంటున్నారు. సోమవారం ఖమ్మం వచ్చి కూనవరం వెళ్లేందుకు భద్రాచలం వెళ్తున్న డీలక్స్ బస్సు ఎక్కారు. వైరా బస్టాండ్‌కు వచ్చిన తర్వాత పక్కనున్న తోటి ప్రయాణీకుడితో పంటినొప్పిగా ఉందని చెప్పి కొన్ని మంచినీళ్లు తాగారు. బస్టాండ్ నుంచి బస్సు జాతీయ ప్రధాన రహదారిలోని పోలీస్‌స్టేషన్ సమీపానికి వచ్చే సమయానికి శ్వాస ఆడక సత్యనారాయణ తీవ్ర ఇబ్బందిపడ్డారు. ఆ వెంటనే 108వాహనంలో చికిత్స కోసం ఖమ్మం తీసుకువెళ్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందారు. సత్యనారాయణకు ఇంకా కేవలం ఏడాది మాత్రమే కార్యదర్శిగా సర్వీస్ ఉంది. ఏపీలోని కూనవరం ఆయన స్వస్థలం. అక్కడకు వెళ్తూ గుండెపోటుతో మార్గ మధ్యలోని వైరాలో హఠాన్మరణం చెందారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు న్నారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వైరా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సత్యనారాయణ భౌతికకాయం

డ్రగ్ ఇన్‌స్పెక్టర్లమంటూ బురిడీ

చింతకాని, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపులను తనిఖీ చేసేందుకు వరంగల్ నుంచి వచ్చిన స్పెషల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బృందం అంటూ మండల కేంద్రంలోని రెండు ప్రైవేట్ మెడికల్ షాపుల యజమానులను బురిడీ కొట్టించి డబ్బులు వసూలు చేసి అక్కడి నుంచి ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కారులో దిగిన ముగ్గురు వ్యక్తులు మెడికల్ షాపుల్లోకి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లమంటూ వెళ్లారు. లైసెన్స్‌లు, మందులకు సంబంధించిన బిల్లులు చూపించమని యజమానిని ప్రశ్నించి తనిఖీ చేశారు. లైసెన్స్ పత్రాలు సరిగా లేవని షాపు సీజ్ చేస్తామంటూ బెదిరించి కౌంటర్‌లో ఉన్న కొంత నగదును తీసుకుని వెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే సదరు జిల్లా కార్యాలయానికి బాధితులు సమాచారం అందించగా అధికారులెవ్వరూ రాలెదంటూ సమధానం వచ్చింది. దీంతో బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసు సిబ్బంది ప్రాథమిక విచారణ చేపడుతున్న నేపథ్యంలో నిందితులు ముగ్గురు గత ఆదివారం మధ్యాహ్నం ఓ హోటల్‌లో భోజనం చేసి బిల్లును ఫోన్‌పే ద్వారా చెల్లించడంతో ఫోన్‌పే చేసిన నెంబరు, అకౌంటు ఆధారంగా ముగ్గురిలో ఒకరిని పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏన్కూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.సీతారాం సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పీహెచ్‌సీని, నాచారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. రోగుకలు 24గంటలు అందుబాటులో ఉండాలని కోరారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాములు, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, హెల్త్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వస్త్రాల వితరణ

మధిర రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మధిరలోని ఆదరణ సేవ ఫౌండేషన్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఊట్కూరి వేణుగోపాల్‌రావు జన్మదినం సందర్భంగా ఈ వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు చారుగుండ్ల నర్సింహమూర్తి, పల్లపోతు ప్రసాద్, కుంచం కృష్ణారావు పాల్గొన్నారు.

టీఎల్‌పేట వద్ద ఎస్కేప్ చానెల్‌ను నిర్మించాలి

వైరా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తేలిగ్గా తీసుకువచ్చేందుకు ఏన్కూరు మండలంలోని టీఎల్‌పేట వద్ద నాగార్జున్‌సాగర్ ఎడమ కాల్వపై ఎస్కేప్ ఛానెల్ నిర్మించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. మండలంలోని గన్నవరం గ్రామంలో మేడా శరాబందీ అధ్యక్షతన సోమవారం జరిగిన రైతు సంఘ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేయడం కోసం ప్రభుత్వం నిర్మించిన రాజీవ్ లింక్ కెనాల్ ఏన్కూరు దిగువ భాగంలో ఎన్నెస్పీ ఎడమకాల్వకు అనుసంధానం చేయడం వల్ల 14కిలోమీటర్ల దూరంలో ఎర్రబోడుతండా వద్ద ఉన్న సాగర్ ఎస్కేప్ ఛానెల్ వరకు బ్యాక్ వాటర్‌తో గోదావరి జలాల తరలింపు అత్యంత కష్టతరమవుతుందని, ప్రమాదకరం కూడా అని రాంబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నెస్పీ ఎడమకాల్వ గట్లు రెండువైపులా బలహీనంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైరా సొసైటీ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు చిన్నసత్యనారాయణ, నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

108 సిబ్బంది
మెరుగైన సేవలు అందించాలి

కొణిజర్ల,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సకాలంలో స్పందించి అత్యున్నతమైన వైద్య సేవలను అందించాలని 108 సిబ్బందికి మూడు జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని తనికెళ్ళ సమీపంలో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిపూలే బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం నందు 108 సేవలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒక్క ఫోన్‌కాల్‌తో 108 సిబ్బంది వాహనంతో వచ్చి సేవలను అందిస్తారని, ప్రజలంతా అంబులెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ కొత్తపల్లి సతీష్, పైలెట్ బోరిమళ్ళ రామారావు, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శివకుమార్

పాఠశాలలకు వర్క్‌బుక్స్ పంపిణీ

కారేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వపాఠశాలలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన వర్క్‌బుక్స్‌ను సోమవారం మండల విద్యాశాఖాధికారి జయరాజు పంపిణీ చేశారు. వీటితోపాటు పాఠశాలలోనే గ్రంథాలయాలకుకూడా పుస్తకాలు మంజూరు అయ్యాయని వాటిని కూడా పంపిణీచేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాతోపాటు, అవసరమైన పాఠ్యపుస్తకాలు, దుస్తులు, సన్నబియ్యంతో కూడిన బోజనం వంటి సౌక్యరాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయానికి చెందిన సిబ్బందిపాల్గొన్నారు.